



చూడచక్కగా..

ఆలమూరు మండలం పెదపళ్ల పంట భూముల మధ్యలో హరివిల్లు చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.. ● ఆలమూరు

అలైన్‌మెంట్ సమస్యలను అధిగమించి
రైల్వే లైన్ పనులు చేపట్టాలి

కలెక్టర్ మహేష్‌కుమార్



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి-నర్సాపురం ప్రతిపాదిత రైల్వేలైన్ అలైన్‌మెంట్‌లో క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ రైల్వే నిర్మాణ పనులు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో కోనసీమ రైల్వేలైన్ అలైన్‌మెంట్‌లో వస్తున్న సమస్యలపై రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌తో కలిసి లైన్ డిపార్టుమెంట్ అధికారులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. భట్నవిల్లి నుంచి మలికిపురం మండలం గుడిమెళ్లంక వరకు ఉన్న ప్రతిపాదిత రైల్వేలైన్ అలైన్‌మెంట్‌కు సంబంధించి క్షేత్రస్థాయిలో డిపార్టుమెంట్ల వారీగా ఉన్న సమస్యలను తెలుసుకునేందుకు సర్వే నిర్వహించామన్నారు. శివకోడు, చింతలపల్లి దగ్గర ప్రతిపాదిత రైల్వేలైన్‌కు గెయిల్ పైపులైను క్రాస్ అవుతుందని, అక్కడ ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సి ఉంటుందని గెయిల్ అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. మామిడికుదురు మండలం కొండాలమ్మచింత వద్ద ఓఎన్జీసీ పైపులైన్‌ను అలైన్‌మెంట్ లైన్ క్రాస్ చేస్తుందని, పైపులైన్లకు నష్టం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఓఎన్జీసీ అధికారులు వివరించారు. మలికిపురం మండలం గుడిమెళ్లంకలో పది ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉందని, ఆ చెరువు మీదుగా రైల్వేలైన్ అలైన్‌మెంట్ వెళుతుందని ఆ ప్రాంత ప్రజలను ఒప్పించే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలను శాఖల వారీగా అడిగి తెలుసుకున్నారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ కోనసీమలో రవాణా సౌకర్యాలు తక్కువగా ఉన్నాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను రైల్వేలైన్‌ను నిర్మించాల్సిన ఆవశ్యకతను వివరించారు. వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేసేందుకు రైల్వేమార్గం చౌకైనదన్నారు. 2000 సంవత్సరంలో శంకుస్థాపన చేసిన రైల్వేలైన్ ఇప్పటికీ పూర్తికాకపోవడం బాధాకరమన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం ఆర్డీవోలు కె.మాధవి, శ్రీకర్, కతీబ్‌కౌశర్‌భానో, రైల్వే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.రామలింగరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

21 నుంచి వాడపల్లిలో వార్షిక బ్రహ్మోత్సవాలు



పందిరిరాట ముహూర్తం చేస్తున్న అర్చకులు

ఆత్రేయపురం, అక్టోబరు 10: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 21వ తేదీ నుంచి 29 వరకు తిరుమల తరహాలో నిర్వహించనున్నారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలు వైఖానస ఆగమ శాస్త్రప్రకారం బ్రహ్మశ్రీ ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చకులు క్రతువును నిర్వహించనున్నారు. ప్రసిద్ధి రాష్ట్రాలకు చెందిన వాయిద్య కళాకారుల ప్రదర్శనలు, ఫలపుష్ప, విద్యుత్ సొబగులతో ఈ బ్రహ్మోత్సవాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఉప కమిషనరు నల్లం చక్రధరరావు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలపై సమీక్ష నిర్వహించారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం బ్రహ్మోత్సవాలకు సం బంధించి ఆలయ ప్రాంగణంలో పందిరి రాట నిర్వహించే కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు పందిరి రాట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి యాగశాల నిర్మాణానికి బ్రహ్మోత్సవ పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, సర్పంచ్ కాయల జగన్నాథం, సూపరింటెండెంట్లు శ్రీనివాస్, రాంబాబు, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు యేపుగంటి వెంకటేష్ పాల్గొన్నారు.

జిల్లాలో ఐదు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు

- నీటి సంఘాల ఎన్నికలకు చర్యలు
- కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీలో ఎనిమిది డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉండగా ఐదు మాత్రమే కోనసీమ జిల్లా పరిధిలోకి వస్తాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. వీటి పరిధిలో 32 నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయని, 40 రోజుల వ్యవధిలో వీటికి ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణపై గురువారం ఇరిగేషన్, రెవెన్యూశాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 16 నుంచి నవంబరు 24 వరకు 40 రోజుల కాల వ్యవధిలో ఎన్నికలు పూర్తి చేయాలన్నారు. ఒక్కో నీటి వినియోగదారుల సంఘంలో 12 టెరిటోరియల్ నియోజకవర్గాలు ఉంటాయని, ఒక్కో టెరిటోరియల్ కానిస్టెన్సీలో 600 వంద నుంచి 700 ఎకరాల ఆయకట్టు ఉంటుందన్నారు. అక్టోబరు 16న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందన్నారు. 26న టీసీల వివరాలను ఇరిగేషన్ అధికారులు ప్రచురించాలన్నారు. 29న తుది జాబితా ప్రచురించాలన్నారు. నవంబరు 5న టీసీల్లో ఓటర్ల జాబితాలను రెవెన్యూ అధికారులు తయారు చేయాలన్నారు. 8న తుది ఓటరు జాబితా ప్రచురించాలన్నారు. నవంబరు 15న టెరిటోరియల్ నియోజకవర్గాలకు, వినియోగదారుల సంఘాలకు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, ఆర్డీవోలు కె.మాధవి, శ్రీకర్, కతీబ్‌కౌశర్‌భానో, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కనకదుర్గగా మాణిక్యాంబ



ద్రాక్షారామ, అక్టోబరు 10 : ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో 8వ రోజు గురువారం మాణిక్యాంబ అమ్మవారు కనకదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి సన్నిధిలో విశేష పూజలు జరిగాయి. మధ్యాహ్నం శ్రీచక్రనవావర్ణార్చన, సాయంత్రం లక్ష కుంకుమార్చన, సువర్ణ, రజత పుష్పార్చన జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



దుర్గాదేవిగా శ్రీదేవి అమ్మవారు



దుర్గాదేవిగా కల్యాణదుర్గమ్మ

అమలాపురంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పలు వీధులలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీదేవి మార్కెట్ సెంటర్‌లో శ్రీదేవి అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలో కల్యాణ దుర్గమ్మ దుర్గాదేవిగా దర్శనమిచ్చారు..

● అమలాపురం టౌన్

రోడ్ల ఆధునికీకరణకు రూ.13.43 కోట్లు విడుదల

ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు



ముమ్మిడివరం, అక్టోబరు 10: ముమ్మిడివరం నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంత రోడ్ల ఆధునికీకరణకు రూ.13.43 కోట్లు విడుదలైనట్టు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల రోడ్లన్నీ నిర్లక్ష్యానికి గురవ్వడంతో రోడ్లు, రవాణా మార్గాలు లేక ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నారన్నారు. ప్రజలకు రోడ్లు, రవాణా మార్గాన్ని మెరుగు పరిచేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రూ.13.43 కోట్లతో సిమ్మెంటు రోడ్ల నిర్మాణం చేపడతామని ఆయన తెలిపారు. ముమ్మిడివరం మండలం 15 గ్రామాల్లో 33 ప్రాంతాల్లో రూ.2.91 కోట్లతోను, కాట్రేనికోన మండలంలోని 11 గ్రామాల్లోని 48 ప్రాంతాల్లో రూ.2.82 కోట్లు, ఐ.పోలవరం మండలంలోని 13 గ్రామాల్లో 46 ప్రాంతాల్లో 4.26 కోట్లు, తాళ్లరేవు మండలంలోని 11 గ్రామాల్లోని 67 ప్రాంతాల్లో రూ.3.43 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. ఈ పనులకు సంబంధించి 14న ముమ్మిడివరం మండలం, 15న తాళ్లరేవు మండలం, 16న ఐ.పోలవరం మండలం, 17న కాట్రేనికోన మండలంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు చెప్పారు.

క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలి

రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్

రామచంద్రపురంలో సబ్ జూనియర్ అంతర్‌జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలు



కడప, తూర్పుగోదావరి జిల్లా జట్ల మధ్య మ్యాచ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బోస్

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 10: క్రీడా స్ఫూర్తితో క్రీడాకారులు బంగారు భవిష్యత్తును అందిపుచ్చుకోవాలని ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరగనున్న జీఎంసీ బాలయోగి స్మారక 9వ సబ్ జూనియర్ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభోత్సవ సభలో ఎంపీ బోస్ మాట్లాడారు. క్రీడల ప్రాధాన్యం ప్రపంచం మొత్తం గుర్తించిందని చెప్పారు. వరల్డ్ క్లాస్ యూనివర్సిటీలు సహితం యూనివర్సిటీ సీట్లలో 5 శాతం క్రీడలకు కేటాయించడమే ఇందుకు ఉదాహరణ అన్నారు. రామచంద్రపురంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్‌కు ఎంతో ఖ్యాతి ఉందన్నారు. గతంలో జాతీయ స్థాయి పోటీలు దిగ్విజయంగా నిర్వహించిన ఘనత దక్కిందన్నారు. ఎంతో మంది దాతలు, అసోసియేషన్ ప్రతినిధులు కృషితో ఇది సాధ్యమైందన్నారు. సహకరిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలుపుతూ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గన్నమని చక్రవర్తిని ప్రత్యేకంగా ఎంపీ బోస్ అభినందించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మాజీ ఏఎంసీ చైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణమూర్తి, డా. కోట సునీల్, మోడరన్ విద్యాసంస్థల అధినేత లయన్ జి.వి.రావు, బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర కార్యదర్శి గన్నమని చక్రవర్తి, ఉపాధ్యక్షుడు జి.భూషణరావు, టెక్నికల్ కమిటీ చైర్మన్ సురేష్‌బాబు, జాయింట్ సెక్రటరీ మాణిక్యాలరావు, డా. చెలికాని రామారావు పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభం

ప్రారంభోత్సవ సభ అనంతరం పోటీలను ఎంపీ బోస్ ప్రారంభించారు. తూర్పుగోదావరి, కడప జట్లను ఎంపీ బోస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి తదితరులు పరిచయం చేసుకున్నారు. తొలి మ్యాచ్ తూర్పుగోదావరి, కడప బాలికల జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. బాస్కెట్ బాల్ పోటీలకు రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి 11 బాలుర జట్లు, 9 బాలికల జట్లు పాల్గొంటున్నాయి.

ఓఎన్జీసీ వాహనాలను అడ్డగించి ఆందోళన

- 5 ఏళ్లుగా లీజు చెల్లించకపోవడంపై ఆగ్రహం..
- పురుగు మందుల డబ్బాలతో నిరసన
- ఎంపీ హరీష్‌మాథుర్ హామీతో ఆందోళన విరమణ



అధికారులు, గ్రామస్థుల మధ్య చర్చలు జరుగుతున్న దృశ్యం

కాట్రేనికోన, అక్టోబరు 10: కాట్రేనికోన మండలం ఉప్పూడిలో ఓఎన్జీసీ వాహనాలను రైతులు రెండో రోజు గురువారం కూడా అడ్డుకున్నారు. తమ వద్ద తీసుకున్న భూములకు 5 ఏళ్లుగా లీజు చెల్లించకపోవడంపై ఆగ్రహించిన రైతులు వాహనాలను అడ్డుకుని పురుగు మందు డబ్బాలతో నిరసన తెలిపారు. తమకు భూములు మాత్రమే ఆధారమని లీజులు చెల్లించకపోవడం దారుణమని అన్నారు. రైతులను ఓఎన్జీసీ అధికారి శ్రీనివాస్ సముదాయించే ప్రయత్నం చేశారు. వెల్‌సైటు పీఏఫ్‌హెచ్ ఆయిల్ అండ్ గ్యాస్ ప్రైవేటు లిమిటెడ్ అనే సంస్థ నిర్వహిస్తున్నదని ఓఎన్జీసీ కాదని తేల్చి చెప్పారు. భారత ప్రభుత్వం డిస్కవర్ స్మాల్ ఫీల్డ్ పథకం ప్రకారం రైతులు భూములు లీజుకు తీసుకుని నిర్వహిస్తున్న వెల్‌సైట్ పీఏఫ్‌హెచ్ ఆయిల్ అండ్ గ్యాస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి బదిలీ చేశామన్నారు. పీఈఎల్/ఎంఎల్ లీజు ఒప్పందం ఇప్పటికే పీఏఫ్‌హెచ్ కంపెనీకి బదిలీ చేయబడిందని తెలిపారు. రైతలు లీజు చెల్లింపులు ఆ కంపెనీయే చెల్లిస్తుందని వివరించారు. ఫిబ్రవరి 2020లో జరిగిన గ్యాస్‌లీక్ సమయంలో గ్రామస్థులు క్లెయిమ్ చేసిన నష్టపరిహారం కూడా అదే కంపెనీ చెల్లించాల్సి ఉందన్నారు. తమ వద్ద లీజుకు తీసుకున్న భూములను వేరొక కంపెనీకి అప్పగించామని చెప్పడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూములు లీజుకు తీసుకుని తమకు తెలియకుండా వేరే కంపెనీకి ఎలా లీజుకు ఇస్తారని అధికారులను నిలదీశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ కలగజేసుకుని శాంతింప చేసే ప్రయత్నం చేశారు. చివరకు ఈనెల 12న జిల్లా కలెక్టర్ సమక్షంలో రైతులు ఓఎన్జీసీ అధికారులతో చర్చించి రైతులకు చెల్లించాల్సిన లీజుతో పాటు, గ్యాస్ లీకు సమయంలో ఓఎన్జీసీ ఇస్తానన్న నష్టపరిహారం గ్రామంలో ప్రతీ రేషన్‌కార్డుదారునికి రూ.5 వేలు చెల్లించే విధంగా ప్రయత్నిస్తానని ఎంపీ హరీష్‌మాథుర్ హామీ ఇవ్వడంతో రైతులు, గ్రామస్థులు తాత్కాలికంగా ఆందోళన విరమించారు. వాహనాలకు అడ్డు తొలగించారు. కార్యక్రమంలో ఎస్టేట్ సర్వేష్ మేనేజరు శ్రీనివాస్, చీఫ్ మేనేజరు కిశోర్ పాల్గొన్నారు.



సంతాపం తెలియజేస్తున్న కామర్స్ ప్రతినిధులు

రతన్‌టాటాకు ఘన నివాళి

అమలాపురం టౌన్, అక్టోబరు 10: అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో రతన్‌టాటా మృతికి సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కామర్స్ ప్రతినిధులతో సంతాప సభ నిర్వహించి రతన్‌టాటా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా దుర్గాష్టమి పూజలు

ప్రత్యేకాలంకరణలో అమ్మవార్లు

వార్తలు..8లో

ఘనంగా దుర్గాష్టమి పూజలు

● ఎనిమిదోరోజు దుర్గాదేవి అవతారంలో విజయదుర్గమ్మ

రాయవరం, అక్టోబరు 10: దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని ఎనిమిదోరోజు గురువారం రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా అమ్మవారు దుర్గాదేవి అవతారం అలంకరించి పూజలు అందుకుంది. పీఠాధిపతి గాడ్ ఆధ్యాత్మిక ప్రసంగంచేస్తూ దుర్గమాసురుడు అనే రాక్షసుడ్ని అమ్మవారు సహారం చేసిన ఘట్టాలను వివరించారు. పీఠంలో మహా మహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ చేసిన ఆధ్యాత్మిక ప్రసంగం ఆకట్టుకుంది. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో బాబి, విజయ దుర్గా సేవాసమితి సభ్యులు బి.రమ, జి.సత్య వెంకట కామేశ్వరి, భాస్కరనారాయణ, వి.సత్య కనకదుర్గా భక్తులు పాల్గొన్నారు.


రాయవరం: దుర్గాదేవిగా విజయదుర్గమ్మ, ముమ్మిడివరం: గోదశివారిపాలెంలోని శ్రీవిజయదుర్గమ్మ

ఆలమూరు: గురువారం దుర్గాష్టమి పర్వదిన సందర్భంగా పలు ఆలయాలలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిమలవద్ద అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు.

120 కిలోల పసుపుకొమ్ములతో అలంకరణ

అమలాపురం టౌన్: అమలాపురం గ్రామ దేవత శ్రీసుబ్బాలమ్మ అమ్మవారిని దసరా ఉత్సవాల్లో భాగంగా పసుపు కొమ్ములతో ప్రత్యేకంగా అలంకరించారు. గునిశెట్టి వలీబాబా కుటుంబ సభ్యులు అమ్మవారికి 120 కిలోల పసుపు కొమ్ములతో అలంకరణ జరిపించారు. ఈ నెల 11, 12 తేదీల్లోను అమ్మవారు భక్తులకు పసుపు కొమ్ములతోనే దర్శనమిస్తారు.

లక్ష పసుపుకొమ్ముల పూజ

ఐ.పోలవరం: మురమళ్ళ భద్రకాళికి గురువారం లక్ష పసుపుకొమ్ముల పూజ జరిగింది. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దంపతులు పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పసుపుకొమ్ములను అమ్మవారికి సుందరంగా అలంకరించారు. ఆలయ ఏసీ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రాజరాజేశ్వరీదేవిగా వాసవీమాత

అంబాజీపేట: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బస్టాండ్ వద్ద ఉన్న శ్రీ వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారిని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించారు. సంతమార్కెట్‌లో ఉన్న శ్రీవిజయకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో, విజయబేతాళస్వామి, పక్షులరావిచెట్టు వద్ద, మాచవరం ఇటికాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాలలో పూజలు చేశారు.

కె.గంగవరం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం దుర్గాదేవి ఆలయాల్లో దుర్గాష్టమి పూజలు నిర్వహించారు. కోటిపల్లి కనకదుర్గ ఆలయంలో కలశపూజ చేశారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం ఈ పూజా కార్యక్ర మాల్లో పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: దుర్గాపీఠాధిపతి భాస్కర స్వామీజీ ఆధ్వర్యంలో పలువురు వేదపండితులు అమ్మవారికి పూజలు నిర్వహించారు.

అల్లవరం: అల్లవరం విజయదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో మంగళపల్లి పాండురంగ విఠల్ ఆధ్వర్యంలో వేద పండితులు లక్ష్మీగణపతి, రుద్ర, చండీ మృత్యుంజయ హోమాలు నిర్వహించారు. కోల్లాటి మురళీకృష్ణ, బండిగుప్తాపు సూర్యబాల దంపతులు కర్తలుగా హోమాలు, పూజలు జరిగాయి. ఆచంట రవి, కాకిలేటి సాయిరామ్, సుంకర రాము, అడపా శ్రీనివాసరావు పూజల్లో పాల్గొన్నారు. బెండమూర్లంక, గోడితిప్ప, గోడి, మొగళ్లమూరు, దేవగుప్తం, కొమరగిరిపట్నం, గోడిలంక, కోడూరుపాడు, బోడసకుర్రు తదితర గ్రామాల్లో దుర్గాదేవికి కుంకుమ పూజలు నిర్వహించారు.

ఆత్రేయపురం: ఉచ్చిలి విజయదుర్గాదేవిని శ్రీదుర్గామాతగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. వాడపల్లి అమ్మవారి ఆలయంలో మహిళలు లలితా సహ స్రనామ పారాయణం నిర్వహించగా వందల సంఖ్యలో భవానీ దీక్షాధారులు భజనలు చేశారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలంలో కనకదుర్గమ్మ ఆలయాల వద్ద జరిగే సరస్వతీ పూజల్లో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పాల్గొని పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. రామేశ్వరం కాలవరేవు సెంటర్‌లో శరన్నవరాత్రుల్లో భాగంగా జరిగిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పాల్గొన్నారు. అంతర్వేది సైకిల్‌షాపు సెంటర్‌లో కనకదుర్గమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు.


అమలాపురం: 120 కిలోల పసుపుకొమ్ములతో శ్రీసుబ్బాలమ్మ

ముమ్మిడివరం: మండలంలోని గోదశివారి పాలెంలోని శ్రీవిజయదుర్గమ్మవారు దుర్గామాతగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని నిమ్మకాయలు, పువ్వులతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపించారు. చినకొత్తలంకలో శ్రీవిజయదుర్గమ్మవారు దుర్గామాతగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దవంతెన సమీపంలోని విళ్ల ఈశ్వరమ్మ ఆలయంలో విజయదుర్గమ్మవారు దుర్గామాతగా భక్తులకు దర్శనమిచ్చారు.

యానాం: యానాం శివారు గిరియంపేట రోడ్డులోని పాలకనకదుర్గమ్మవారి ఆయలంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. యానాం త్యాగరాజవీధిలోని లలితాదేవి ఆలయంలో, గోపాల్‌నగర్‌లోని శారదాదేవి ఆలయంలో, శివాలయ ప్రాంగణంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాల్లో అమ్మవార్లు దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

మామిడికుదురు: మగటపల్లిలోని గాయత్రీ త్రిశక్తి పీఠంలో సుమారు 500 మంది ముత్తయిదువులు పూజలు చేశారు. పాశర్లపూడిలోని కనకదుర్గమ్మ ఆలయంలో కుమారి పూజ, సుహాసినీ పూజ, శమీపూజ, ప్రత్యేక కుంకుమపూజలు జరిగాయి. పెదపట్నంలంక కనకదుర్గమ్మవారు మహాగౌరీ అలంకారంలో గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. మామిడికుదురులోని విజయదుర్గమ్మవారి ఆలయంలో పారిజాత పుష్పాలతో విశేష అర్చన జరిగింది.

భేతాళ ఉత్సవంలో అల్లర్లకు పాల్పడితే కఠినచర్యలు: డీఎస్పీ

అంబాజీపేట, అక్టోబరు 10: అంబాజీపేటలో ఈనెల 16న నిర్వహించే శ్రీ విజయ బేతాళ ఉత్సవంలో అశ్లీల కార్యకలాపాలు నిర్వహిస్తే నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కొత్తపేట డీఎస్పీ వైగోవిందరావు హెచ్చరించారు. పెద్దవీధిలోని కళ్యాణమండపంలో సీఐ రుద్రరాజు భీమరాజు ఆధ్వర్యంలో 13 వాహనాలకు సంబంధించిన ఉత్సవకమిటీ నిర్వాహకులతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. ఉత్సవాల్లో అల్లర్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

దుకాణాల వేలంపాటలో ముందుకు రాని వ్యాపారులు

మండపేట, అక్టోబరు10: మండపేట మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ దుకాణాల వేలంపాట నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రంగారావు తన చాంబర్‌లో ఆర్‌వో శాస్త్రి రెవెన్యూ సిబ్బంది వేలం పాటను నిర్వహించారు. మొత్తం 35 దుకాణాలకు వేలంపాట నిర్వహించగా కేవలం ఐదు దుకాణాలను మాత్రమే వ్యాపారులు దక్కించుకున్నారు. దీంతో మరోసారి వాటికి వేలం నిర్వహిస్తామని కమిషనర్ ప్రకటించారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

పి.గన్నవరం, అక్టోబరు 10: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం సచివాలయం-2 భవనాన్ని ఆయన ప్రారంభించి అనంతరం మాట్లాడారు. ప్రతి గ్రామంలోని సమస్యలను గుర్తించి దశలువారీగా పరిష్కరిస్తామన్నారు. అదే విధంగా ఎమ్మెల్యేతో పాటు పలువురు నాయకులను, అధికారులను పాలకవర్గం సభ్యులు దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.

'విలువలతో కూడిన వ్యక్తి రతన్‌టాటా'

మలికిపురం, అక్టోబరు 10: దేశంలో కొందరి మరణం కొన్ని లక్షల కుటుంబాలను ప్రభావితం చేస్తుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రతన్ టాటా మృతిచెందిన సందర్భంగా గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రతన్‌టాటా చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, నాని, దేశినీడి తాతాజీ, విజయ్ పాల్గొన్నారు.

'రతన్‌టాటాను స్ఫూర్తిగా తీసుకోవాలి'

అంబాజీపేట: దేశం గర్వించతగ్గ విధంగా ఎదిగిన రతన్‌టాటాను స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎం పీడీవో జీవీ సరోవర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రతన్‌టాటా చి త్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ ఎం.ప్రశాంత్, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మండపేట: దేశపారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా మరణం దేశానికి తీరని లోటని పలువురు ప్రముఖులు అన్నారు. రతన్ టాటా మృతికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, ఏపీసీసీ సభ్యుడు కామన ప్రభాకరరావు, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కోనా సత్యనారాయణ, సంతాపం తెలిపారు.

రెండు వేల లీటర్ల డీజిల్ సీజ్

ద్రాక్షారామలో యానాం నుంచి అక్రమంగా వాహనంలో రవాణా చేస్తున్న 2వేల లీటర్లు డీజిల్‌ను ద్రాక్షారామ పోలీసులతో కలసి ఎంఎస్‌వో భాషా సీజ్ చేశారు. బుధవారం వాహనంలో పీపాలలో రవాణా చేస్తున్న డీజిల్‌తోపాటు వాహనం కూ డా సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

'పైపులైను వేయిస్తాం'

అంతర్వేది, అక్టోబరు 10: సఖినేటిపల్లి మండలం రామేశ్వరం గ్రామంలో మంచినీటిచెరువు, ఓవర్‌హెడ్ ట్యాంకును రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పరిశీలించారు. గ్రామస్తులు, పాత పైపులైనుతీసి కొత్తపైపులైను వేయాలని అటు అధికారులు, ఇటు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు విన్నవించడంతో వారు సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రతీ ఇంటికి తాగునీరు అందించే దిశగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు.

కొబ్బరిలో అంతరసాగుతో మేలు

అల్లవరం, అక్టోబరు 10: ప్రకృతి వ్యవసాయం, కొబ్బరి తోటల్లో అంతర పంటల సాగుద్వారా రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ పీఎల్ జి.శ్రీనివాసరావు, ఎస్పీఎంయా ఎం.చంద్రబాబు అన్నారు. అల్లవరం మండలం కోడూరుపాడు, అల్లవరం, పరిసర గ్రామాల్లో కేరళ బృందం సభ్యులతో పాటు కొబ్బరితోటల్లో అంతర సాగు, వరిచేల గట్లపై కూరగాయల సాగును పరిశీలించారు.

నిత్యావసర వస్తువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

అంబాజీపేట, అక్టోబరు 10: నిత్యావసర ధరలు, కూరగాయల ధరలను ఎంఆర్పీ ధరల కంటే అధికంగా విక్రయిస్తే సంబంధిత షాపు యజమానిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దారు జె.వెంకటేశ్వరి, ఎంఎస్వో ఎస్.సత్యనారాయణ హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు మండలంలోని కిరాణా, కూరగాయాలు, సూపర్‌మార్కెట్లను రెవెన్యూ అధికారుల బృందం పరిశీలించింది. డీటీ కె.ఏడుకొండలు, వీఆర్వోలు జి.రమణ, జి.వెంకటేశ్వరరావు, ఐవీవీ రమేష్, డీలర్ దొమ్మేటి ఏడుకొండలు పాల్గొన్నారు.

నిర్ధేశించిన రేట్లకు విక్రయించాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ): నిత్యావసరవస్తువులు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు విక్రయించాలని మండల సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ భాష కోరారు. గురువారం రామచంద్రపురంలో పలు హోల్‌సేల్, రిటైల్ షాపులను తనిఖీ చేశారు.

టీడీపీ నాయకుల సంతాపం


సంతాపం తెలుపుతున్న టీడీపీ నాయకులు

ముమ్మిడివరం, అక్టోబరు 10: ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్‌టాటా మృతి తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో జరిగిన రతన్‌టాటా సంతాప సభలో టీడీపీ నాయకులు పాల్గొని టాటా చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు, ఎస్సీసెల్ అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు, టీడీపీ నాయకుడు ఎంవీఎస్‌చౌదరి, నలాది స్వామినాయుడులతో పాటు పలువురు టాటా చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

కోటిపల్లి-నర్సాపురం రైల్వే పనులకు సహకరిస్తా : ఎమ్మెల్యే దేవ

మలికిపురం, అక్టోబరు 10: కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ ఎలైన్‌మెంట్‌పై జరిగిన సమావేశంలో రైల్వేలైన్‌కు సంబంధించి రాజోలు నియోజకవర్గంలో ఏదైనా సమస్య తలెత్తితే ఆ సమస్య పరిష్కారానికి సహకరిస్తానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపినట్టు చెప్పారు. గురువారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో రాజోలు నియోజకవర్గంలో ఒక వ్యక్తి రైల్వేలైన్ భూసేకరణ విషయమై సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారని, ఆ వ్యక్తితో తాను పలుమార్లు సంప్రదించినట్టు ఆయన చెప్పారు. భూసేకరణ విషయంలో రైతులు సహకరించి రూ.600 కోట్లతో చేపట్టిన ఈ 216 బైపాస్ రోడ్డుతో పాటు రైల్వే లైన్ నిర్మాణానికి సహకరించాలని కోరినట్టు ఆయన చెప్పారు.

పల్లె పండుగలో అభివృద్ధి పనులకు శ్రీకారం

పి.గన్నవరం, అక్టోబరు 10: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెపండుగ కార్యక్రమంతో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు పండుగ వాతావరణం రానుంది. గ్రామాల్లోని శివారు ప్రాంతాలకు సైతం పూర్తిస్థాయిలో సీసీ రోడ్లు ఏర్పాటు చేసే విధంగా ఇప్పటికే ఆయా గ్రామపంచాయతీల ద్వారా తీర్మానాలు సిద్ధం చేసుకున్నారు. ఆరు రోజుల్లో ఆయా పనులకు భూమిపూజలు చేసేందుకు మండలస్థాయిలో అధికారులు షెడ్యూల్‌కూడా సిద్ధం చేసుకున్నారు. ఈక్రమంలో పి.గన్నవరం నియోజక వర్గంలోని 68 గ్రామాలు ఉండగా రూ.11.24 కోట్లు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు.

మండపేట: మండలంలో ఈనెల 14నుంచి పల్లెపండుగ వారోత్సవాలను నిర్వహిస్తున్నామని మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఇప్పనపాడు, ద్వారపూడి, మారేడుబాక, తాపేశ్వరం, జెడ్.మేడపాడు గ్రామాల్లో జరిగే కార్యక్రమాలలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎంపీపీ ఉండమట్ల వాసు పాల్గొంటారని ఆయన తెలిపారు.

కపిలేశ్వరపురం: ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులనుంచి మంజూరైన 39 పనులకుగాను ఈనెల 15న భూమిపూజ చేయనున్నట్లు ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొనేలా సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అవగాహన కల్పించనున్నట్లు ఆమె తెలిపారు.

పల్లె పండుగ వారోత్సవాలు విజయవంతం చేయాలి

ముమ్మిడివరం: ఈనెల 14వ తేదీ నుంచి జరిగే పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను విజయవంతం చేయాలని ముమ్మిడివరం ఎంపీపీ కోలా గంగాభవానీ విజ్ఞప్తి చేశారు. ముమ్మిడివరం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో తాడి వెంకటాచార్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏవో ఏఎస్ శ్రీనివాస్, పంచాయతీరాజ్ డీఈఈ పాలకొల్లు విజయశ్రీనివాస్, సర్పంచ్ గొలకోటి దొరబాబు, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, ఈవోపీఆర్డీ సీహెచ్ లక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వి.నానాజీరావు, ఏపీవో డి.వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మలికిపురం: మన గ్రామం-మన బాధ్యతలో భాగంగా చింతలమోరి సర్పంచ్ డాక్టర్ రాపాక రమేష్‌బాబు ఆధ్వర్యంలో గురువారం చింతలమోరి పల్లిపాలెంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, అక్టోబరు 10: తీరప్రాంత మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. నూరుశాతం రాయితీపై మంజూరైన పరికరాలను భైరవపాలెంనకు చెందిన 64 మంది మత్స్యకారులకు గురువారం పంపిణీ చేశారు.

ఐ.పోలవరం ఎస్ఐగా మల్లిఖార్జునరెడ్డి

ఐ.పోలవరం, అక్టోబరు 10: ఐ.పోలవరం ఎస్ఐగా పి.మల్లిఖార్జునరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ శ్రీనివాస్ బదిలీ కావడంతో ఈ నియామకం జరిగింది.

శ్రీపాదుకా భీమనాథమ్ పుస్తకావిష్కరణ

ద్రాక్షారామ, అక్టోబరు 10 : శ్రీపాదుక ఆచార్య కొల్లూరి అవతారశర్మ రచించిన ద్రాక్షారామ క్షేత్ర మహత్యం శ్రీపాదుకా భీమనాథమ్ గ్రంథాన్ని ఆలయ సహాయ కమీషనర్ అల్లు వెంకట దుర్గాభవాని గురువారం ఆవిష్కరించారు. ద్రాక్షారామ స్థలపురాణం, భీమేశ్వరుని పూజావిధానం, స్తోత్రములు అవతారశర్మ శ్రీపాదుకాభీమనాథమ్ గ్రంథంలో పొందుపరిచినట్లు తెలిపారు.

వ.నెం	పూజా వివరం	రుసుము
	ఏకాదశి రుద్ర తైలాభిషేకం	
1.	ఒకసారి తైలాభిషేకం	రూ. 600/-
2.	శాశ్వత తైలాభిషేకం (10 సం॥లు మాత్రమే)	రూ. 6,000/-
3.	ఒక సం॥లో వచ్చే 52 శనివారములకు	రూ. 31,200/-
4.	శాశ్వత శని త్రయోదశులు (10 సం॥లు మాత్రమే)	రూ. 36,000/-
	మహన్యాస పూర్వక తైలాభిషేకం	
1.	ఒకసారి తైలాభిషేకం	రూ. 400/-
2.	శాశ్వత తైలాభిషేకం (10 సం॥లు మాత్రమే)	రూ. 5,000/-
3.	ఒక సం॥లో వచ్చే 52 శనివారములకు	రూ. 20,800/-
4.	శాశ్వత శని త్రయోదశులు (10 సం॥లు మాత్రమే)	రూ. 30,000/-
	శని జపములు	
1.	స్వయముగా రాలేని వారు శని జపములు 19000, తర్పణములు 4000, తైలాభిషేకం మరియు హూమ సామాగ్రితో కలిపి శనివారం మొదలు పెట్టి మరలా శనివారం వరకు	రూ.8000/-
2.	స్వయముగా వచ్చి ఒకే రోజులో శని జపములు 19000, తర్పణములు 4000, తైలాభిషేకం మరియు హూమ సామాగ్రితో కలిపి	రూ.8,000/-
	శాంతి హూమం	
1.	శని శాంతి హూమం సామాగ్రి, దక్షిణతో కలిపి	రూ.15,00/-